## క్లుప్తంగా

### సొంత నిధులతో బోరు ఏర్పాటు



హ్యాండ్ బోరు ఏర్పాటు పనులను పర్యవేక్షిస్తున్న అప్పలనాయుడు

**దత్తిరాజేరు:** మండలంలోని ఎం.లింగాలవలసలో సిరిసిలమ్మ ఆలయం వద్ద సర్పంచ్ మజ్జి రామలక్ష్మి, అప్పలనాయుడు దంపతులు తమ సొంత నిధులు రూ.80 వేలతో హ్యాండ్ బోరు ఏర్పాటు చేశారు. ఆదివారం అమ్మవారి పండగ నిర్వహించనున్న నేపథ్యంలో ఈ బోరును సర్పంచ్ భర్త, వైఎస్సార్‌సీపీ నాయకుడు అప్పలనాయుడు శనివారం ప్రారంభించారు.

### ఆర్థిక సహాయం



బాధిత కుటుంబానికి నగదు అందజేస్తున్న గోల్డెన్ హార్ట్ ట్రస్ట్ సభ్యులు

**వేపాడ:** మండల కేంద్రానికి చెందిన పెయింటర్ గూడుపు అప్పలరాజు ఈనెల 4వ తేదీన విశాఖ పట్నంలో ఓ భవనానికి పెయింట్ వేస్తుండగా జారిపడి మృతి చెందారు. పెద్ద దిక్కును కోల్పోయిన ఆ పేద కుటుంబానికి వేపాడకు చెందిన గోల్డెన్ హార్ట్ ట్రస్ట్ సభ్యులు శనివారం రూ.10 వేల ఆర్థిక సహాయం అందించారు. ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

### చురుగ్గా రేషన్ పంపిణీ



బోడసింగిపేటలో ఎండీయూ వాహనం వద్ద రేషన్ సరుకులు తీసుకుంటున్న స్థానికులు

**బొండపల్లి:** గజపతినగరం నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లోనూ రెండు రోజులుగా ఎండీయూ వాహనాల ద్వారా ఇంటింటికీ రేషన్ సరుకుల పంపిణీ చురుగ్గా సాగుతోంది. రేషన్ పంపిణీలో ఎక్కడా అవినీతి,అక్రమాలుకు తావులేకుండా ఉండేవిధంగా ప్రభుత్వం సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ చేయడంతో పాటు కొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చింది. ఈ నేపథ్యంలో సర్వర్ పని చేయక ఈనెలకు సంబంధించిన రేషన్ పంపిణీలో ఇబ్బందులు తలెత్తాయి. ప్రభుత్వం ఈసమస్యను పరిష్కరించడంతో రేషన్ పంపిణీ యథావిధిగా సాగిపోతోంది.


### పౌష్టికాహార నాణ్యత పరిశీలన



అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పాటూరులో పంపిణీ చేసిన పౌష్టికాహారాన్ని పరిశీలిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కామేశ్వరి

**వేపాడ:** వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకంలో భాగంగా పాటూరులోని రెండు అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో గర్భిణులు, బాలింతలకు పంపిణీ చేసిన పౌష్టికాహారం నాణ్యతను ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కామేశ్వరి శనివారం ఇంటింటికీ వెళ్లి పరిశీలించారు. పౌష్టికాహార ప్యాకెట్లను తెరిచి, వస్తువులు ఎలా ఉన్నాయో పరిశీలించాలని పీడీ ఆదేశించారని సూపర్‌వైజర్ తెలిపారు. పౌష్టికాహారం నాణ్యంగానే ఉంద ని ఆమె చెప్పారు. ఆమె వెంట అంగన్‌వాడీ కార్యకర్తలు ఉన్నారు.

### విజినిగిరిలో స్వచ్ఛభారత్



విజినిగిరి గ్రామంలో స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహిస్తున్న స్కౌట్ విద్యార్థులు

**జామి:** హిందుస్థాన్ స్కౌట్స్ అండ్ గైడ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విజినిగిరి గ్రామంలో శనివారం స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోని చెత్తాచెదారాన్ని తొలగించి పరిశుభ్రం చేశారు. కార్యక్రమంలో స్టేట్ చీఫ్ కమిషనర్ బూర్లి సతీష్, స్టేట్ కమిషనర్ ఎం.సాయి, స్కౌట్ గైడ్‌లు పాల్గొన్నారు.

### మహిళపై మద్యం కేసు నమోదు

**కొత్తవలస:** మండలంలోని బలిఘట్టం గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఓ మహిళను స్పెషల్ ఎన్ ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్ఈబీ) పోలీసులు శనివారం అదుపులోకి తీసుకున్నారు. ఎస్ఈబీ ఎస్ఐ పి.నరేంద్రకుమార్ తెలిపిన వివరాలు.. గ్రామంలో ఓ మహిళ మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో ఆమె నివాసంలో సోదాలు చేశామని చెప్పారు. ఆమె ఇంట్లో ఆరు మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశామని పేర్కొన్నారు.

# పేదరిక నిర్మూలనే లక్ష్యం

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే కడుబండి



మహిళకు పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

**జామి:** పేదరికం నిర్మూలనే లక్ష్యంగా ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని ఎస్.కోట ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని తానవరం గ్రామంలో శనివారం సాయంత్రం 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి పథకాలు అందుతున్నాయా లేదా అని ప్రతీ కుటుంబాన్ని ఆరా తీసి, వారి సమస్యలు తెలుసుకున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల లక్ష్యాన్ని వివరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలాంటి అవినీతి, సిఫార్సులకు తావులేకుండా, పార్టీలకతీతంగా అర్హులందరికీ పారదర్శకంగా పథకాలు అందిస్తున్న ఘనత సీఎం జగన్‌కే దక్కు తుందన్నారు. మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని చెప్పారు. అధికశాతం పథకాలకు సంబంధించిన నగదును మహిళల ఖాతాలోనే జమ చేస్తు న్నామన్నారు. పేదరికం కారణంగా ఏ ఒక్కరూ చదువుకు దూరం కాకూడదనే ఉద్దేశంతో పిల్లలను బడికి పంపించే తల్లులకు అమ్మఒడి పథకంలో భాగంగా రూ.15 వేలు అందిస్తున్నామని, అలాగే జగనన్న విద్యాకానుక పేరిట విద్యార్థులకు బ్యాగులు, నోట్, పాఠ్య పుస్తకాలు, యూనిఫాం, బెల్టులు, బూట్లు ఇస్తున్నామని, జగనన్న గోరుముద్ద పథకం ద్వారా రోజుకో మెనూతో నాణ్యమైన భోజనం అందిస్తున్నామని వివరించారు. నాడు–నేడు కార్యక్రమంలో భాగంగా పాఠశాలలు, కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల ను ఆధునీకీకరించి, మౌలిక సదుపాయాలు మెరుగుపరుస్తున్నామని చెప్పారు. విద్యాదీవెన, వసతిదీవెన తదితర పథకాలతో పేదపిల్లల ఉన్నత చదువులకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని అన్నారు. ప్రజలకు ప్రభుత్వ సేవలన్నీ సచివాలయాల ద్వారా గ్రామాల్లోనే అందిస్తున్నామని, రైతులకు విత్తనాలు,ఎరువులను రైతు భరోసా కేంద్రాల ద్వారా సకాలంలో సరఫరా చేస్తున్నామని, ధాన్యం కొనుగోలును సైతం గ్రామాల్లోనే చేపడుతున్నామని పేర్కొన్నారు. జెడ్పీటీసీ గొర్లె సరయు, మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ గొర్లె రవికుమార్, మండల జేసీఎస్ కన్వీనర్ శీరెడ్డి చందునాయుడు, మాజీ వైస్ ఎంపీపీ సిరికి నారాయణరావు, స్థానిక ఎంపీటీసీ సిరికి నాగేశ్వరరావు, విజినిగిరి సర్పంచ్ కిలారి సూర్యారావు, జాగరం ఎంపీటీసీ పి.నరసింహనాయుడు, నాయకులు గొర్లె అప్పలనాయుడు, అల్లు వెంకటరావు, ఎర్ర సత్యం, కసిరెడ్డి నారాయణరావు, సింగారపు అప్పల రాజు తదితరులు పాల్గొన్నారు.

# పోలాల అమావాస్య పూజలు



దత్తిరాజేరు: వేంకటేశ్వరస్వామిని దర్శించుకుంటున్న భక్తులు



గజపతినగరం: శ్రీనివాస ఆలయంలో భక్తులకు తీర్థ,ప్రసాదాలు అందజేస్తున్న అర్చకులు



జామి: పుష్పగిరిలో పూజలందుకుంటున్న వేణుగోపాలస్వామి

**దత్తిరాజేరు:** పోలాల అమావాస్య నేపథ్యంలో మండలంలోని దత్తి గ్రామంలో శ్రీదేవి,భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం పత్యేక పూజలు నిర్వ హించారు. అర్చకులు కందాడ హరికృష్ణ ఆధ్వర్యంలో స్వామి వారికి మేల్కొలుపు, సుప్రభాత తదితర విశేష పూజలు చేశారు. చుట్టు పక్క గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులకు ఆలయ ధర్మకర్త పెంకి తిరుపతినాయుడు ఆధ్వర్యంలో తీర్థప్రసాదాలు అందజేశారు.

**సీతారాముల ఆలయంలో...**

**గజపతినగరం:** స్థానిక సీతారాములు, శ్రీనివాస ఆలయంలో అర్చకులు శ్రీనివాసాచార్యుల ఆధ్వర్యంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచే భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు.

**వేణుగోపాలస్వామి ఆలయంలో..**

**జామి:** మండలంలోని పుష్పగిరి గ్రామంలోని పురాతన వేణుగోపాలస్వామి ఆలయంలో శనివారం విశేష పూజలు చేశారు. స్వామివారిని ఆలయ ప్రధాన అర్చకులు రవిస్వామి తులసీ దళాలు, పుష్పాలతో విశేషంగా అలంకరించారు. భక్తులు స్వామివారికి అభిషేకాలు చేశారు.

# నేటి నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు



శృంగవరపుకోట: స్థానిక దేవీ జంక్షన్‌లోని ఆలయంలో కనకదుర్గ అమ్మవారు



బొండపల్లి: అంబటివలసలోని సంతోషిమాత ఆలయం వద్ద మండపంలో ప్రతిష్ఠించేందుకు సిద్ధం చేసిన అమ్మవారి విగ్రహాలు

**శృంగవరపుకోట:** స్థానిక దేవీ జంక్షన్‌లోని దుర్గాదేవి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు ఆదివారం నుంచి ప్రారం భంకానున్నాయని ఆలయ కమిటీ సభ్యులు శనివారం తెలిపారు. నిత్యం అమ్మవారికి కుంకుమ పూజలు ఉంటాయని, అమ్మవారు రోజుకో అవతారంలో భక్తులకు దర్శనం ఇవ్వనున్నారని చెప్పారు. 15న బాలత్రిపుర సుందరీదేవిగా, 16న గాయత్రీదేవి, 17న అన్నపూర్ణ, 18న మహాలక్ష్మీదేవి, 19న కాత్యాయిని, 20న సరస్వతీదేవి, 21న లలితాదేవి, 22న దుర్గాదేవి, 23న మహిషాసురమర్దిని, 24న రాజరాజేశ్వరి దేవిగా అమ్మవారు దర్శనమిస్తారు.

**ఉత్సవాలకు సర్వం సిద్ధం**

**బొండపల్లి:** అంబటివలసలోని సంతోషిమాత ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలకు అర్చకులు గుమ్మా విశ్వనాథ్ కుమారులు నర్సింహమూర్తి, చంటి ఆధ్వర్యంలో సర్వం సిద్ధం చేశారు. ఆలయ ప్రాంగణంలో మండపం ఏర్పాటు చేశారు. వివిధ అవతారాల్లో ఉన్న అమ్మవారి విగ్రహాలను ఈ మండపంలో ప్రతిష్ఠించేందుకు ఇప్పటికే తీసుకువచ్చారు. పూజా కార్యక్రమాలకు ఏర్పాట్లు చేశారు. ఆదివారం ఉదయం విగ్రహాలను మండపంలో ప్రతిష్ఠించనున్నారు. అలాగే దేవుపల్లిలోని రాజరాజేశ్వరీదేవి ఆలయంలో కూడా ఉత్సవాలకు ఏర్పాట్లు చేశారు.

# సిరిమాను చెట్టుకు ప్రత్యేక పూజలు



సిరిమాను చెట్టుకు పూజలు చేస్తున్న ఆర్టీసీ జోనల్ చైర్‌పర్సన్ గదల బంగారమ్మ

**నెల్లిమర్ల:** జరజాపుపేటలో గుర్తించిన పైడితల్లి సిరిమాను చెట్టుకు భక్తులు ప్రత్యేక పూజలు చేస్తున్నారు. ఈ క్రమంలో ఆర్టీసీ జోనల్ చైర్‌పర్సన్ గదల బంగారమ్మ శనివారం చెట్టును దర్శించుకుని పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పైడితల్లి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు. అలాగే ఆర్డీఓ ఎంపీ సూర్యకళ, ఏఎస్పీ అస్మాఫర్హీన్, తదితరులు చెట్టును దర్శించుకున్నారు. కార్యక్రమాల్లో పైడితల్లి ఆలయ ఈఓ సుధారాణి, విద్యుత్‌శాఖ ఎస్ఈ లక్ష్మణరావు, నగర పంచాయతీ వైస్‌చైర్మన్ సముద్రపు రామారావు, తహసీల్దార్ డి. ధర్మరాజు, ఎస్సై నారాయణరావు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

### 17న మండల సర్వసభ్య సమావేశం

**బొండపల్లి:** స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ చల్లా చలంనాయుడు అధ్యక్షతన ఈనెల 17న మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వై.వి.రాజేంద్ర ప్రసాద్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. సమావే శానికి అతిథిగా గజపతినగరం ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. ఎంపీటీసీలు, సర్పంచ్ లు, మండల అధికారులు ఆరోజు ఉదయం 10 గంటలకు హాజరు కావాలని కోరారు.

### సోషల్ ఆడిట్‌పై ప్రజావేదిక రేపు

**కొత్తవలస:** ఉపాధి హామీ పథకంలో భాగంగా 2022 ఏప్రిల్ నుంచి 2023 మార్చి నెలాఖరు వరకు మండలంలో చేపట్టిన పనులపై సోషల్ ఆడిట్(సామాజిక తనిఖీ)ను సిబ్బంది ఇటీవల పూర్తి చేశారని ఎంపీడీఓ ఎంపీడీఓ వై.పద్మజ తెలిపారు. ఈఆడిట్ నివేదికలపై స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో సోమవారం ప్రజావేదిక నిర్వహించనున్నట్లు ఆమె శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. సుమారు రూ.20 కోట్లతో చేపట్టిన 450 పనులపై ఆడిట్ నిర్వహించామని, ఆయా పనులపై నివేదికలను ప్రజావేదికలో వివరిస్తామని, ప్రజాప్రతినిధులు, ప్రజలు హాజరు కావాలని కోరారు.

### ఆలయ అభివృద్ధికి సహకరించాలి



కొండగుళ్లులో ప్రాచీన శిలాఫలకాన్ని పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

**వేపాడ:** మండలంలో ప్రసిద్ధి చెందిన కొండగుళ్లు బ్రహ్మలింగేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి దేవదాయ శాఖ సహకరించాలని జిల్లా బీజేపీ అధ్యక్షుడు మేడపాటి రవీంద్ర కోరారు. ఆలయాన్ని బీజేపీ మండల అధ్యక్షుడు గోకేడ మహేష్, పలువురు నాయకులతో కలిసి కొండగుళ్లును శనివారం ఆయన సందర్శించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పురాతన కొండగుళ్లు దేవాల యాన్ని దేవదాయశాఖ పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. ఆలయం జీర్ణావస్థకు చేరుకుంటోందన్నారు. ఆలయ పరిసర గ్రామాలకు చెందిన దాతల విరాళాలతో ఆలయంలో దూపదీపనైవేద్యాల కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు స్థానికులు వారికి తెలిపారు. సమస్యలను ఎండోమెంట్ అధికారుల దృష్టికి తీసుకెళ్లి దేవదాయ శాఖ నుంచి దూపదీపనైవేద్యాలకు నిధులు మంజూరు చేసేలా, అలాగే ఆలయ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. జిల్లా బీజేపీ కార్యదర్శి శ్రీరంగం దినేష్, జిల్లా మహిళా అధ్యక్షురాలు ఉమ్మడి సుజాత, కరకవలస గ్రామపెద్ద దుల్ల అప్పన్న దేవాలయ అర్చకులు పవన్ శర్మ పాల్గొన్నారు.

### కొత్తవలస ఎంఈఓకు బదిలీ

**కొత్తవలస:** మండల విద్యాశాఖ అధికారి(ఎంఈఓ)–1 జి.శ్రీదేవిని చీపురుపల్లి మండలానికి బదిలీ చేసినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి బి.లింగేశ్వరరెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. పరిపాలనా సౌలభ్యంలో భాగంగా ఆర్జేడీ ఆదేశాల మేరకు ఆమెను బదిలీ చేశామని పేర్కొన్నారు. ప్రస్తుతం ఆమె బాధ్యతలను ఎంఈఓ–2 బండారు శ్రీనివాసరావుకు అప్పగించినట్లు తెలిపారు.

# శతశాతం అక్షరాస్యతకు కృషి





విద్యాసామగ్రిని అందజేస్తున్న వికాస్ సంస్థ ప్రతినిధులు,గ్రామపెద్దలు

**చీపురుపల్లిరూరల్(గరివిడి):** నిరక్షరాస్యులైన వయోజనులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు 'వయోజన అక్షరాస్యత' కార్యక్రమం నిర్వహిస్తున్నామని స్వచ్ఛ హృదయ సేవా వికాస్ సంస్థ స్టేట్ కో–ఆర్డినేటర్ శివారెడ్డి తెలిపారు. గరివిడి మండలంలోని శివరాం గ్రామంలో వయోజన అక్షరాస్యత కార్యక్రమం నిర్వహించేందుకు ఆ సంస్థ ఎంపిక చేసుకుంది. గ్రామంలో పదిహేనేళ్లు పైబడిన నిరక్షరాస్యులకు రాయడం, చదవడం నేర్పించేందుకు అవసరమైన విద్యాసామగ్రిని స్థానికులకు శనివారం అందజేశారు. గ్రామపెద్ద గవిడి దాలినాయుడు, వార్డు మెంబర్ ఎం.సన్యాసి, ఫెసిలిటేటర్ ఆర్.బాలకృష్ణ పాల్గొన్నారు.

# దివ్యాంగులకు వరం గురుదేవా ట్రస్ట్

- కేంద్ర సహాయ మంత్రి నారాయణస్వామి



కృత్రిమ అవయవాల తయారీ విధానాన్ని కేంద్ర సహాయ మంత్రి నారాయణస్వామికి వివరిస్తున్న గురుదేవా ట్రస్ట్ చైర్మన్ జగదీష్‌బాబు

**కొత్తవలస:** గురుదేవా చారిటబుల్ ట్రస్ట్ దివ్యాంగుల పాలిట వరమని కేంద్ర సామాజిక న్యాయ,సాధికారత శాఖ సహాయ మంత్రి ఎం. నారాయణ స్వామి అన్నారు. మండలం లోని మంగళపాలెం గ్రామ సమీపంలోని గురుదేవా చారిటబుల్ ట్రస్ట్ వజ్రోత్సవాల్లో భా గంగా స్థానిక ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు,ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజుతో కలిసి శనివారం ట్రస్ట్‌ను ఆయన సందర్శించారు. బుద్ధిమాంద్యం గల పిల్లలు,వారి తల్లులకు శిక్షణ ఇచ్చేందుకు ట్రస్ట్ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన కేంద్రాన్ని, ఫిజియోథెరపీ ,స్పీచ్, హియరింగ్, న్యూరో ఫిజీషియన్ సెంటర్లను ఆయన ప్రారంభిం చారు. అలాగే ట్రస్ట్‌కు చెందిన సూపర్ స్పెషాలటీ ఆస్పత్రి, కృత్రిమ అవయవాల తయా రీ కేంద్రాన్ని పరిశీలించారు. కృత్రిమ కాళ్లు,చేతులు తయా రు చేసే విధానాన్ని ట్రస్ట్ చైర్మన్ రాపర్తి జగదీష్‌బాబు ఆయనకు వివరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావే శంలో ఆయన మాట్లాడుతూ సేవచేస్తున్నట్లు వాట్సాప్, ఫేస్‌బుక్, ట్విట్టర్ తదితర సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేసుకునే సంస్థలు ఎక్కువైపోయాయని అసహనం వ్య క్తం చేశారు. వీటికి భిన్నంగా గురుదేవా చారిటబుల్ ట్రస్ట్ దివ్యాంగుల సేవలో తరిస్తోందన్నారు. గత 25 ఏళ్లలో సుమారు 2లక్షల మందికి కృత్రిమ అవయవాలను అందించి వారి జీవితాల్లో వెలుగులు నింపిన ట్రస్ట్ చైర్మన్ జగదీష్‌బాబు కృషి అభినందనీయమన్నారు. ట్రస్ట్ సేవాకార్యక్రమాలకు కేంద్ర ప్రభుత్వం ద్వారా తమ వంతు సహకారం అందిస్తామన్నారు. దేశంలో ప్రతీ వ్యాపార సంస్థ, కంపెనీ సీఎస్ఆర్(కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబులిటీ)లో భాగంగా సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. అనంతరం పలువురు దివ్యాంగులకు ఉపకరణాలే అందజేశారు. అలాగే జానపద కళాకారులకు గజ్జెలు, చిడతలు,తాళాలు, దుస్తులు పంపిణీ చేశారు. మాజీ ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు, మాజీ ఎమ్మెల్సీ పి.వి.మాధవ్, కొత్తవలస మేజర్ పంచాయతీ సర్పంచ్ మచ్చా రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి బాస్కెట్ బాల్ పోటీలకు ఎంపిక



కొత్తవలస: రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన కొత్తవలస ఉన్నత పాఠశాల విద్యార్థులతో ఎంఈఓ శ్రీనివాసరావు,హెచ్ఎం ఈశ్వరరావు





మెరకముడిదాం: జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైన గర్భాం మోడల్ స్కూల్ విద్యార్థులతో ప్రిన్సిపాల్ అరుణ, పీడీ రాంబాబు



శృంగవరపుకోట: జిల్లా కబడ్డీ జట్టులో స్థానం సాధించిన నీలిమతో అధ్యాపకులు

**కొత్తవలస:** రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు స్థానిక ఉన్నత పాఠశాల విద్యార్థులు ఇద్దరు ఎంపికయ్యారని ఆ పాఠ శాల పీడీలు ఎం.పాప, కె.కనకమహాలక్ష్మి శనివారం తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్–14,17 విభాగాల్లో ఎస్.కోట మండలంలోని వెంకటరమణపేట ఉన్నత పాఠశాలలో ఇటీవల జిల్లాస్థాయి పోటీలు నిర్వహించారని పేర్కొన్నారు. ఈ పోటీల్లో బాలికల విభాగంలో 10వ తరగతి విద్యార్థిని ఎం.లిషా, బాలురు విభాగంలో పి.దినేష్ సత్తా చాటి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని చెప్పారు. విద్యార్థులను ఎంఈఓ బండారు శ్రీనివాసరావు,హెచ్ఎం చీపురుపల్లి ఈశ్వరరావు అభినందించారు.

**జిల్లాస్థాయి పోటీలకు 15 మంది..**

**మెరకముడిదాం:** మండలంలోని గర్భాం మోడల్ స్కూల్ విద్యార్థులు 15 మంది జిల్లాస్థాయి స్కూల్ గేమ్స్ పోటీ లకు ఎంపికయ్యారని ఆపాఠశాల ప్రిన్సిపాల్ డి.వి.ఎస్.అరుణ శనివారం తెలిపారు. ఇటీవల చీపురుపల్లిలో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి ఖోఖో, కబడ్డీ, అథ్లెటిక్ పోటీల్లో బాలురు, బాలికల విభాగాల్లో వీరు ఉత్త మ ప్రతిభ కనబరిచి జిల్లాస్థాయికి అర్హత సాధించారని పేర్కొన్నారు. విద్యార్థులను ప్రిన్సిపాల్‌తో పాటు పీడీ పి.రాంబాబు అభినందించారు.

**జిల్లా కబడ్డీ జట్టులో నీలిమకు స్థానం**

**శృంగవరపుకోట:** అండర్–19 స్కూల్ గేమ్స్ రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక చేసిన జిల్లా బాలికల జట్టులో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన ఇంటర్ సెకెండియర్ విద్యార్థిని బత్తుల నీలిమకు స్థానం దక్కింది. ప్రిన్సిపాల్ కృష్ణమూర్తి శనివా రం మాట్లాడుతూ ఈనెల 6,7వ తేదీల్లో విజయగనరం రాజీవ్ స్టేడియంలో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో నీలిమ ఉత్తమ ప్రదర్శన కనబరచడంతో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికై ందని చెప్పారు. విద్యార్థిని ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు, కోచ్ అల్తి తాతబాబు, ప్రిన్సిపాల్, అధ్యాపకులు అభినందించారు.

# కషాయాల తయారీపై అవగాహన



కషాయాల తయారీపై అవగాహన కల్పిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

**వేపాడ:** పంటలను ఆశించే చీడపీడల నివారణకు ప్రకృతి వ్యవసాయంలో భాగంగా కషాయాల తయారీపై మండలంలోని శింగరాయి గ్రామంలో రైతులకు ప్రకృతి వ్యవసాయ పాటూరు యూనిట్ ఎంసీఆర్ పి.ఈశ్వరమ్మ శనివారం అవగాహన కల్పించా రు. పలు పత్రాలతో కషాయాల తయారీని ప్రయోగాత్మకంగా వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వరి పంటను ఆశించే తెగుళ్లు, చీడపీడలను రసాయన పురుగుమందులు కాకుండా వివిధ రకాల కషాయాలను వినియోగించి నివారించవచ్చని అన్నారు. జిల్లేడు కషాయం పిచికారీ చేయడం వల్ల పంటకు పొటాషియం అందుతుందన్నారు. సేంద్రియ ఎరువుల వినియో గంతో పెట్టుబడి లేకుండా పంటలు సాగుచేయవచ్చని, ఈ విధంగా సాగు చేసిన పంటలను ఆహారంగా తీసుకుంటే ఆరోగ్యంగా ఉండవచ్చని చెప్పారు. పలువురు సీఆర్పీలు పాల్గొన్నారు.

# శ్మశానవాటిక అభివృద్ధి పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న తహసీల్దార్ హేమంత్‌కుమార్, తదితరులు

**జామి:** స్థానిక శ్మశాన వాటిక అభివృద్ధి పనులను తహసీల్దార్ హేమంత్‌కుమార్, ఏజీపీ అల్లు సత్యాజీ తదితరులు శనివారం పరిశీలించారు. పాత శ్మశాన వాటికలో కొంతభాగం గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణంలో కలిసిపోయింది. దీంతో మండల కేంద్రానికి చెందిన వారు ఎవరైనా మరణిస్తే వారి దహన సంస్కారాలు నిర్వహించేందుకు స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొనాల్సి వస్తోంది. సమస్యను మండల నాయకులు అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో పాత శ్మశానవాటిక పక్కనే అధికారులు స్థలం కేటాయించారు. ఈ స్థలంలో శ్మశాన వాటిక కోసం హైవే అధికారులు పనులు చేపడుతున్నారు. తహసీల్దార్ వెంట గ్రామ పెద్దలు ఉన్నారు.